
# అల్లుడొచ్చినప్పుడే పండుగ

– ప్రఫుల్లచంద్ర

**మధ్యాహ్నం భోజనాలయాక వంటిల్లు చక్కబెట్టి బెడ్‌రూంలో కునుకు తీస్తున్న వరలక్ష్మి ఎడ తెగకుండా మోగుతున్న బజర్ రొదకి ఉలికిపాటుగా లేచి చిరాకుగా తలుపు తెరువగా –**

**ఎదురుగా చిన్నమ్మాయి అలేఖ్య! ఒంటరిగా!**

**ఆమెతో కూడా అల్లుడు రానందుకు వరలక్ష్మిలో అనుమానం సుడిగాలిలాగ రేగింది. అమ్మాయి పోట్లాడి వచ్చేసిందా! పెళ్లయి అత్తవారింటికి వెళ్లిన ఆరునెలలకు అమ్మాయి రావడం ఇదే ప్రథమం. తొలి పండుగకు అమ్మాయి, అల్లుడూ వస్తారని ఎంతగానో ఎదురు చూసినా వాళ్లు రాలేదు. పండుగ పోయిన నెల రోజులకు ఇప్పుడు అమ్మాయి ఒంటరిగా వచ్చింది! వరలక్ష్మి గుండె గుబగుబలాడింది.**



''అల్లుడుగారు రాలేదా?'' హీనస్వరంతో అడిగింది. అలేఖ్య చుట్టూ చూసి ''ఏదీ, రాలేదు కదా మరి!'' అని నవ్వేసింది వేళాకోళం లాగ. వరలక్ష్మి ఏదో అనేలోగా ''అమ్మా! నన్ను లోనికి రానిస్తావా?'' అడిగింది అలేఖ్య.

అమ్మ పక్కకి తప్పుకోగా లోనికి అడుగు పెట్టి, ''నాన్నగారు లేరా?'' అని అడిగింది అలేఖ్య. ఆయన ఏదో పని మీద కార్పొరేషన్‌కు వెళ్లారు. గంటలో వచ్చేస్తారంది అమ్మ.

తర్వాత తల్లీ, కూతురూ బెడ్‌రూంలో చేరారు. అమ్మ మంచం మీద కూర్చోగా కాళ్లూ, చేతులూ కడుక్కుని వచ్చి అమ్మ ఒడిలో తల పెట్టుకొని మంచం మీద నడుం వాల్చింది అలేఖ్య.

పోట్లాట చిహ్నాల కోసం కాబోలు కూతురు ముఖంలోకి పరిశీలనగా చూసింది అమ్మ. అలేఖ్యది అందమైన ముఖం. పెద్ద కళ్లు. తీరైన కనుబొమలు. దరహాసం చిందిస్తూ అరవిచ్చిన పెదవులు. ప్రశాంత వదనం.

లేదు, ఈమె భర్తతో పోట్లాడి రాలేదు!


అమ్మ చేతిని తన చేతిలోకి తీసుకొని మృదువుగా నొక్కుతూ, ''ఏమిటమ్మా! అలా చూస్తున్నావ్?'' అని అడిగింది అలేఖ్య.

''నీతో అల్లుడుగారు రాకపోవడంతో....''

''మేం పోట్లాడుకున్నాం అనుకున్నావా? అలాంటిదేం లేదమ్మా! ఆయన రేపు వస్తారు.''

గుండె కుదుటబడి, వరలక్ష్మి ఆప్యాయంగా కూతురు ముంగురులు సవరిస్తూ చెక్కిలి నిమురుతున్న వేళ బెడ్‌రూంలో అడుగు పెట్టిన విశ్వనాథం

# కథ





## అవకాశాల కోసం అవస్థలెన్నో!!

సినిమా రంగంలో పోటీని తట్టుకోవాలంటే నానా అవస్థలూ పడాలి. కొందరికి బహుమతులు ఇవ్వాలి. కొందరికి పార్టీలు ఇవ్వాలి. ఇచ్చినా ఒకొక్కసారి ఫలితం దక్కదు. అదలా ఉంచితే హీరోయిన్ త్రిష విషయానికి వస్తే తమిళ సినిమా రంగంలో తన పారితోషికం 70 శాతం తగ్గించుకున్నా అవకాశాలు లేకపోవడంతో అర్ధ నగ్నంగా కనిపించేందుకు... ఆమె బికినీ ధరించి నటిస్తానని అంటోంది. త్రిషే ఇలా ప్రకటిస్తే మిగిలిన వాళ్ళు ఊరుకుంటారా!? వాళ్ళూ బికినీలు ధరిస్తామంటున్నారు. కావాలంటే ఇంకా వేరే కాస్ట్యూమ్స్ ధరించి 'సెమీ న్యూడిటి'గా నటించేందుకు రెడీ అంటున్నారు. ఆ కోవలో మధుమిత ముందు వరుసలో ఉంది. అయితే కాస్ట్యూమ్ సైజును బట్టి పారితోషికం ఉంటుందంటూ ఆమె ఒక ఫోటో ఆల్బం తయారుచేసింది. ఆ ఆల్బంలో మధుమిత ఫోటోలు రకరకాల భంగిమల్లో రకరకాల కాస్ట్యూమ్స్‌లో ఉన్నాయి. భంగిమను బట్టి కాస్ట్యూమ్ బట్టి పారితోషికం ఫిక్స్ చేసిందట! కావాలనుకున్న నిర్మాతలు ఆ ఆల్బమ్ చూసి తనని సినిమాలో బుక్ చేసుకోవచ్చంటోంది.

ఆ దృశ్యం చూసి ముచ్చట పడ్డాడు. ''నువ్వెప్పుడొచ్చావే?'' ఆశ్చర్యంగా కూతుర్ని అడుగుతూ భార్య ప్రక్కన కూర్చున్నాడు.

చటుక్కున లేచి కూర్చుంది అలేఖ్య. తర్వాత కబుర్లు, నవ్వులూ....

''నాన్నా! మీరెప్పుడైనా అమ్మకి గ్రీటింగ్స్ చెప్పారా?'' హఠాత్తుగా అడిగింది అలేఖ్య.

ఎస్.ఎం.ఎస్, సెల్‌ఫోన్లకే గ్రీటింగ్స్ పరిమితమైపోయిన ఈ రోజుల్లో కూడా బంధుమిత్రులకు పోస్ట్ ద్వారా గ్రీటింగ్స్ పంపుతూనే ఉన్నాడు విశ్వనాథం. కానీ భార్యకెప్పుడూ శుభాకాంక్షలు చెప్పలేదు. గ్రీటింగ్ కార్డ్ ఇవ్వనూ లేదు. అసలు అలా చెప్పాలనీ, ఇవ్వాలనీ అనిపించలేదు. భార్యకి గ్రీటింగ్సా? హ... హ... హ....

''కానీ నూతన సంవత్సరం రోజున మా ఆయన నాకు గ్రీటింగ్ కార్డు ఇచ్చారు!'' వెలిగిపోతున్న ముఖంతో సగర్వంగా అంది అలేఖ్య.

గ్రీటింగ్ కార్డుల అందానికి కాక అందులో ముద్రించిన శుభాకాంక్షల సందేశానికి ప్రాధాన్యం ఇచ్చే సుమన్, నచ్చిన సందేశం కోసం ఎన్ని షాపులైనా తిరిగి, ఎంతయినా ఖర్చు పెడతాడు.

''ఇన్నేళ్లూ ఎక్కడ దాక్కున్నావు ప్రియా! హఠాత్తుగా చిరుగాలిలా నా జీవన వనంలో ప్రవేశించి కొత్త పరిమళాలు వెదజల్లుతున్నావు! నూతన సంవత్సరంలో నీ జీవితం నవనవోన్మేషం కావాలని కోరుకుంటూ నన్ను నీకు అర్పించుకుంటున్నా'' అన్న సందేశంతో ఉన్న కార్డు అందుకొని పులకించి పోయానని చెబుతూ, ''అలాంటి ఆనందాన్ని మీరెప్పుడూ అమ్మకివ్వలేదు కదూ!''అంది అలేఖ్య బుంగమూతి పెడుతూ.

అల్లుడు తమకు పంపిన గ్రీటింగ్స్ సందేశం: ''అనుకూలవతియైన భార్యను నాకు ప్రసాదించిన మీకెలా కృతజ్ఞతలు చెప్పుకోను? నూతన సంవత్సరం అంతా మీ ఇంట సుఖ సంతోషాలు వెల్లి విరియాలి'' జ్ఞాపకం వచ్చింది వాళ్లకి.

అల్లుని ప్రత్యేకతకు అప్పుడు మురిసిపోయిన విశ్వనాథం దంపతులు ఇప్పుడూ మురిసిపోయారు. అనివార్యంగా వారికి పెద్దల్లుడు లక్ష్మణ్ జ్ఞాపకం వచ్చాడు.

అల్లుళ్లిద్దరూ వేర్వేరు ఐటీ కంపెనీల్లో హైదరాబాద్‌లోనే పని చేస్తున్నా ఇద్దరికీ ఎంత తేడా!

లక్ష్మణ్‌కి అత్తవారినుంచి ఎంత గుంజుకుందామా అన్న యావ తప్ప మరోటి లేదు. తన కోరికలతో మూడేళ్లగా అతడు తమ బీపీ పెంచుతూనే ఉన్నాడు. తమషా ఏమంటే పెద్దమ్మాయి అపర్ణ కూడా భర్తకు వత్తాసు పలుకుతూ వీలైనంత ఎక్కువ గుంజుకోవడానికే ప్రయత్నిస్తుంది. భర్త తనని ప్రేమగా చూసుకుంటున్నందుకు మీరు మూల్యం చెల్లించాల్సిందే అన్నట్లు ఉంటుంది ఆమె ధోరణి.

గత పండుగకు ప్రయాణీకుల రద్దీ ఇబ్బడి ముబ్బడి కాగా బస్సులు, రైళ్లు, ఫ్లైట్లూ కిటకిటలాడాయి. రెట్టింపు డబ్బుపోసి ప్రైవేటు బస్సులో రెండు టిక్కెట్లు సంపాదించాడు లక్ష్మణ్. నలభై సీట్ల బస్సులో వందమంది కూరుకున్నారు. అపర్ణకు సీటు దొరికినా సగం దూరం లక్ష్మణ్ నిలబడవలసి వచ్చింది.

తమ ప్రయాణ కష్టాలు వివరించి, ''అవన్నీ మీ మీద ప్రేమతో భరించాం'' అని ఉద్ఘాటించి, రాలేకపోతున్నామని ఫోన్ చేసిన చెల్లి, సుమన్‌లకు ''మీ మీద ప్రేమలేదు'' అని నిర్ధారించి, ''మీ అల్లుడు గారికి లక్ష రూపాయల కారు మీద మోజు. వన్‌టైమ్ సెటిల్మెంట్‌గా మీరా కారు కొనిచ్చేస్తే జీవితాంతం మీరు కానుకలివ్వనక్కరలేదు. అందువల్ల మీకెంత లాభం!'' అని లెక్కలు చెప్పింది అపర్ణ.

అప్పటికే నిలువు గుడ్లు పడ్డ విశ్వనాథం ''కారు మార్కెట్‌లోకి వచ్చాక చూద్దాంలే'' అంటూ రివాజుగా ఇచ్చే పదివేలు చేతిలో పెట్టి అప్పటికి గండం తప్పించుకున్నాడు.

పెళ్లి చేసి కూతుర్ని అత్తవారింటికి పంపాక వచ్చే మొదటి పండుగ పరీక్షా ఫలితాలు తెలిసే సీజన్ లాంటిది. ఎందుకంటే తాము ఎంపిక చేసిన వాడితో అమ్మాయి జీవితం హాయిగా సాగిపోతున్నదా? అల్లుడు మంచి వాడేనా? అత్తవారింటి పరిస్థితి ఏమిటి? - ఇలాంటి ప్రశ్నలకు జవాబు దొరికేది అప్పుడే.

అల్లుడిని ఎంపిక చేసుకోవడం ఒక పరీక్ష అయితే లక్ష్మణ్‌ని ఎంపిక చేసుకున్న పరీక్షలో తాము పాస్ అయారో, లేదో సందేహమే. అతగాడు తమ పట్ల దశమ గ్రహమే అయినా భార్యను బాగానే చూసుకుంటున్నాడు - ఆమె కూడా తన లాగే డబ్బు మనిషిగా మారి డబ్బు గుంజే నైపుణ్యం సాధించినందువల్ల కాబోలు!

మరి సుమన్ ఎలాంటి వాడో!

పెళ్లి చూపుల కొచ్చినప్పుడు అతని తండ్రి అలేఖ్య జాతక చక్రం ఇమ్మని అడిగితే అతగాడు తమ జాతక చక్రాలు అడిగాడు! నవయువకుడికి, అందులోనూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి జాతకాల పిచ్చి

ఏమిటని ఆశ్చర్యపోయిన విశ్వనాథం తమ జాతక చక్రాలు లేవని చెబితే కనీసం జన్మ దినాలు, పెళ్లి రోజు చెప్పమని అడిగాడు సుమన్! ఆ తేదీలు కాగితం మీద రాసిచ్చాక అమ్మాయితో మాట్లాడాలి అన్నాడు.

పక్కగదిలో వాళ్లిద్దరూ ఏం మాట్లాడుకున్నారో గాని అతనిని తప్ప వేరే ఎవ్వరినీ పెళ్లి చేసుకోనని చెప్పేసింది అలేఖ్య. జాతకాల పిచ్చి తప్ప ఈ సంబంధం వద్దనడానికి కారణాలు కనిపించలేదు విశ్వనాథంకి. అదీకాక వాళ్లు కట్నం అడగలేదు. ఇచ్చినా, ఇవ్వకపోయినా మీ ఇష్టం – అనేసారు. పక్షపాతం లేకుండా పెద్దమ్మాయి కిచ్చినట్లే చిన్నమ్మాయికీ ఐదు లక్షలు కట్నం ఇచ్చి పెళ్లి చేసారు.

''మీ ఆయన జాతకాల పిచ్చి ఎలా ఉందే?'' నవ్వుతూ అడిగాడు విశ్వనాథం.

అలాంటిదేం లేదని అలేఖ్య చెప్పినా ఏదో ఉందనుకున్నారు అమ్మా, నాన్నా. కూతుర్ని దగ్గరగా తీసుకుని ''నీ కాపురం ఎలా ఉందే?'' ఆప్యాయంగా అడిగింది అమ్మ.

''నా ముఖం చూస్తే తెలియడం లేదా?'' నవ్వేసింది అలేఖ్య.

తేరిపార చూసింది అమ్మ. అపర్ణ ముఖంలోనూ ఆనందం కనిపిస్తుంది గాని ఆ ఆనందం ఎవరికీ హాయి నివ్వదు! కాని అలేఖ్య ముఖంలోని ఆనందం వెన్నెలలాగ హాయిగా ఉంది.

* * *

టైమ్ ఐదు అవుతోంటే టిఫిన్ చెయ్యడానికి లేచిన అమ్మని ఆపి –

''ఈ రెండు రోజులూ ఇంటిపని, వంటపనీ నాదే అమ్మా!'' అంటూ లేచిన కూతుర్ని ఆశ్చర్యంగా చూస్తూండి పోయింది అమ్మ.

''ఇది మీ అల్లుడి ఆజ్ఞ అమ్మా! పండుగలకూ, పబ్బాలకూ బంధువులొచ్చి అందరూ హాయిగా కబుర్లు చెప్పుకుంటూ జాలీగా గడుపుతున్నా ఇంటి ఇల్లాలు మాత్రం వంటింటిలో మగ్గిపోయి అందరికీ అన్నీ అమర్చి పెడుతూ ఉంటుంది. ఆమెకు కాస్త రెస్ట్ అవసరం అని ఎవరూ ఆలోచించరు. కాని ఆయనలా కాదు. సెలవు రోజుల్లో ఆయనే స్వయంగా వంట చేసి అమ్మకు రెస్ట్ ఇస్తారు. వంటింటి దరిదాపులకు అమ్మను రానివ్వరు. ఆయనకు సాయం చేస్తూ నేనూ వంట నేర్చుకున్నాను. నా వంట బాగానే ఉంటుందిలే. భయపడకు, రెస్ట్ తీసుకో,'' హుషారుగా కిచెన్ వైపు వెళ్తున్న అలేఖ్యను చూస్తూ ఉండిపోయారు విశ్వనాథం దంపతులు.

తనూ, తన చదువూ తప్ప ఇంటి గొడవ పట్టని అమ్మాయి ఎంత మారిపోయింది! సుమన్ ఆమెను ఎంతగా మార్చేశాడు!

* * *

తెల్లవారగానే నానా హడావుడి చేసి తల్లిదండ్రుల చేత తలస్నానం చేయించి పట్టు బట్టలు కట్టుకోమని చెప్పి తను తలారా స్నానం చేసి పట్టు చీర కట్టుకుంది అలేఖ్య.

''నీ మొగుడ్ని ఆహ్వానించడానికి ఇంత తతంగం అవసరమా?'' జోక్ చేసింది వరలక్ష్మి. అందరూ మనసారా నవ్వుకున్నారు.

అంతలోనే గుమ్మంలో కొత్తకారు ఆగడం, దానిలోంచి దిగి సుమన్ లోనికి రావడం, చేతిలోని బట్టల ప్యాకెట్లు అత్త మామల చేతిలో పెట్టి అలేఖ్యకు సైగ చేయడం, ఠంగ్న ఇద్దరూ మోకరిల్లి ''మమ్మల్ని ఆశీర్వదించండి'' అనడం చకచకా జరిగిపోయాయి.

విశ్వనాథం దంపతులకు దిగ్భ్రాంతిగా ఉంది. ఉద్వేగంగానూ ఉంది. ఏమీ అర్థం కావడం లేదు. కళ్లు చెమర్చాయి. ''ఏమిటి బాబూ ఇదంతా!'' అన్నారు.

''ఈనాడు మీ పెళ్లి రోజు అంకుల్! మరిచిపోయారా?'' నవ్వుతూ అడిగాడు సుమన్. వాళ్లు పెళ్లి రోజు మరిచిపోయి చాలా కాలం అయింది.

''పెళ్లి చూపుల్లో నేను మీ జన్మదినాలు, పెళ్లి రోజు అడిగితే నేనో జాతకాల పిచ్చోడినని అనుకున్నారు కదూ!'' అని గలగలా నవ్వేసి, ''ఇప్పుడు మనం కారులో అన్నవరం వెళ్తున్నాం. స్వామి వారి కళ్యాణం చేయిస్తున్నాం'' చెప్పాడు సుమన్.

''అతనితో అన్నీ ఆశ్చర్యాలే. అన్నీ ఆనందాలే,'' అని మురిసి పోయారు విశ్వనాథం దంపతులు.

సుమన్ కారు నడుపుతోంటే వెనక తల్లిదండ్రులతో కూర్చున్న అలేఖ్య చెప్పింది – అత్తవారు లాంఛనంగా కట్నం తీసుకున్నా తనకే ఇచ్చేశారట. ఇచ్చిన డబ్బు వెనక్కి తీసుకోవడం ఎందుకని ఈ మధ్యనే సుమన్ బర్త్‌డే సందర్భంగా ఈ కారు కొని బహుమతిగా ఇచ్చిందట!

వింటూనే వారి ప్రేమానురాగాలకు పరవశించారు తల్లిదండ్రులు.

అన్నవరంలో ఎన్నోసార్లు స్వామి వారి వ్రతం చేసుకున్నా కళ్యాణం మాత్రం చేయించలేదు విశ్వనాథం దంపతులు. ఇప్పుడు సుమన్ పుణ్యమా అని ఆ ముచ్చటా తీరింది. కళ్యాణం అయాక స్వామి వారి ఉచిత భోజనం ఆరగించి కాసేపు విశ్రాంతిగా రత్నగిరిపై కూర్చున్నారు నలుగురూ.

అంతటా వ్యాపించిన ధూపదీప అగరు సువాసనలు వారి హృదయాల్ని పరవశింపజేస్తున్నాయి. మృదు గంభీరంగా వినిపిస్తున్న దైవ సంకీర్తనలు కర్ణపేయంగా పులకింపజేస్తున్నాయి. చుట్టూ ఉన్న ప్రకృతి రమణీయత అలౌకికానందం కలిగిస్తోంది.

''అంకుల్! కొంత థ్రిల్, కొంత సస్పెన్స్‌తో బాటు సరదాలూ, సంతోషాలూ లేకుంటే జీవితం రొటీన్‌గా, బోర్‌గా మారిపోయి ఆయుక్షీణం కలుగుతుంది. అందుకే పండుగలతో బాటు జన్మదినాలు, పెళ్లి రోజు లాంటివి ఉత్సాహంగా జరుపుకోవాలి. ఉత్సాహం ఆయుష్షు పెంచుతుంది. వారం రోజులుగా నేనూ, అలేఖ్యా మీ పెళ్లి రోజుని ఎలా జరపాలో ప్లాన్ చేస్తూనే ఉన్నాం. ఎలా ఉంది మా ప్లాన్?'' అడిగాడు సుమన్.

''వెయ్యేళ్లు ఆయుష్షు పెరిగినట్లుంది బాబూ!'' అన్నాడు విశ్వనాథం ఆనంద బాష్పాలు జాలువారుతుండగా. వరలక్ష్మి ఆనందోద్వేగాలను అణచుకోలేక అలేఖ్యను హృదయానికి హత్తుకుంది.

''పండుగకు అల్లుడు రావడం రొటీన్. కాని అల్లుడొచ్చినప్పుడే పండుగ అనిపించడం థ్రిల్ కదూ?'' అని నవ్వాడు సుమన్.

''నాకీ అదృష్టం చాలు,'' అనుకుంది అలేఖ్య పరవశంగా.

సరిగా అదే సమయంలో విశ్వనాథం దంపతులూ అలాగే అనుకున్నారు.

❑

